

www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 21 మార్చి 2023





ఎంఎల్‌సి శ్రీకాంత్‌కు చంద్రబాబు అభినందనలు

ప్రజాశక్తి -కందుకూరు : శాసనమండలి సభ్యులుగా ఎన్నికైన కంచర్ల శ్రీకాంత్ సోమవారం టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుని కలిశారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో గెలుపు కోసం కష్టపడిన కందుకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావుతో పాటు టిడిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలను మంగళగిరి టిడిపి కార్యాలయానికి చంద్రబాబు నాయుడు పిలిపించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడును కలిసిన శ్రీకాంత్ కృతజ్ఞతలు తెలిపారు. శ్రీకాంత్‌తో పాటు ఆయన గెలుపు కోసం కృషి చేసిన టిడిపి కందుకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలను చంద్రబాబు నాయుడు అభినందించారు.


శ్రీకాంత్‌ను సత్కరిస్తున్న చంద్రబాబునాయుడు

కష్టం.. కన్నీరైంది..!

రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట అకాల వర్షం కారణంగా కన్నీట పాలయ్యాయి..మోటార్లు, కాలువ కింద సాగుచేసి, కోతల దశలో ఉన్న సమయంలో రెండు రోజుల నుంచి అకాలంగా కురుస్తోన్న వర్షాలకు ధాన్యం తడిచిపోయింది. అసలే అంతంత మాత్రంగా ఉన్న ధరలు, తడిసిన ధాన్యంతో మరింత పతనమైపోతున్నాయి. వ్యవసాయ అధికారులు నష్టం అంచనా తయారు చేస్తున్నారు, ప్రభుత్వమే ప్రతి రైతు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ వెంకమరాజు డిమాండ్ చేశారు.

అకాల వర్షంతో రైతుకు నష్టం - ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి
అకాల వర్షం రైతులను నిండా ముంచింది. జిల్లా వ్యాపితంగా వరి, మామిడి, మిర్చి, పత్తి, వివిధ దశల్లో ఉన్నాయి. ఓ ప్రాంతంలో వరి కోత దశలో ఉండగా, మరి కొన్ని ప్రాంతాల్లో వెన్ను దశలో ఉన్నాయి. పత్తి చివ్వరిదశ ఉంది. మెట్ట కింద సాగు చేసుకొని రైతులు ఇప్పటికే కోతలకు సిద్ధమయ్యారు. కాలువల కింద కనిగిరి రిజర్వాయర్, బుచ్చి, కోవూరు, కొడవలూరు, విడవలూరు, అల్లూరు., ప్రాంతాల్లో అటు ఇటుగా ఉంది. బంగాళాఖాతంలో అల్పపీడనం సందర్భంగా మూడు రోజుల నుంచి జిల్లా వ్యాపితంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో వరి కోత కోసి రోడ్ల పై ఆరబోసుకుంటున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో కోతకు సిద్ధమయ్యారు. ఇప్పుడు ఒక్కసారిగా వర్షాలు కురవడంతో జిల్లా వ్యాపితంగా పెద్ద ఎత్తున పంట నష్టం జరిగినట్లు తెలుస్తోంది. వర్షాలకు ధాన్యం తడిచిపోయింది. మిర్చి, పత్తి, ధాన్యం అన్ని వర్షాలకు దెబ్బతిన్నాయి. మూడు నెలల పాటు కష్టపడి పండించిన పంట కన్నీళ్లు మిగిల్చిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షం వస్తుందని తెలిసే పట్టలను కప్పుకొని రక్షించుకుంటారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి కనిపించకుండా ఒక్క సారి భారీగా వర్షాలు పడటంతో ఏం చేయాలో తెలియక ధాన్యం మొత్తం తడిచిపోయింది. రెండు రోజుల నుంచి అప్పుడప్పుడు వర్షాలు కురుస్తుండడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. వర్షాలు ఇంకా కొనసాగుతుండడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. కోతలు కోయడానికి సిద్ధపడిన వారు పొలంలోనే వదిలేస్తున్నారు.

అకాల వర్షం, రైతన్నకు నష్టం..!

రెండు, మూడు రోజుల నుంచి జిల్లాలో కురుస్తోన్న వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక అంచనా ప్రకారం జిల్లాలోని 130 గ్రామాల్లో సుమారు 4 వేల హెక్టారుల్లో వరి పంట తడిచినట్లు చెబుతున్నారు. ఉదయగిరి ప్రాంతంలో వేరుశనగ సుమారు 600 హెక్టార్లు, పత్తి 200 హెక్టార్లు దెబ్బతిన్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం ప్రస్తుతం పూర్తి స్థాయిలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. అక్కడక్కడా అడపా, దడపా మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం పుట్టి రూ. 15,500 నుంచి రూ.15,600 కొనుగోలు చేస్తున్నారు. రోజు రోజుకు ఈ ధరలు పతనమైపోతున్నాయి. ఏదొక సాకు చూపించి తక్కువ ధరలకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ఇప్పుడు ధాన్యం తడిచిపోవడంతో అతితక్కువ ధరలకు మిల్లర్లు కొనుగోలు చేసే పరిస్థితి ఉంటుంది. తడిచిన, తేమ, ఇతర కారణాలతో భారీగా ధరలు కోత విధించే పరిస్థితి కనిపిస్తోంది. ప్రభుత్వమే రైతుల నుంచి తడిచిన ధాన్యం కొనుగోలు చేస్తే తప్ప రైతులు కోలుకోలేని పరిస్థితులు కనిపించడం లేదు. ఎకరానికి రూ.25 నుంచి రూ.30 వేల వరకు ఖర్చులు పెట్టుకుంటున్నారు. కనీసం పెట్టుబడైనా వస్తుందా లేదా అనే ఆందోళన రైతుల్లో కనిపిస్తోంది. ప్రభుత్వం చొరవ తీసుకొని రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది..


తోటపల్లి గూడూరు మండలంలో పంటలను పరిశీలిస్తున్న అధికారులు

ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలి

వ్య.కా.స. జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ వెంకమరాజు

అకాల వర్షాలతో తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. లేదా మిల్లర్ల వద్ద ప్రభుత్వం బాధ్యత తీసుకొని కొనుగోలు చేయించాలి. ఇప్పటికే పండించిన పంటలకు గిట్టుబాటు ధర దక్కడం లేదు. ఇప్పుడు వర్షాలతో ధాన్యం తడిచిపోవడం, రంగు మారడం, తేమ అనే సాకుతో ధరలను మరింత తగ్గించే ప్రమాదం ఉంది. జిల్లా అధికారులు బాధ్యత తీసుకొని ధాన్యం కొనుగోలు చేయించి, రైతులకు భరోసా కల్పించాలని లేదంటే రైతులు కోలుకోలేని పరిస్థితి చేరుకుంటారు..

మసూరి ధాన్యం మద్దతు ధరకు కొనుగోలు చేయాలి

రైతు సంఘాలు డిమాండ్

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరు మసూరి ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయడంతోపాటు మద్దతు ధరకే కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఏపి రైతు సంఘం, ఏపి కౌలు రైతు సంఘం, ఏపి వ్యవసాయ కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. సోమవారం బాలాజీనగర్‌లోని డాక్టర్ రామచంద్రారెడ్డి భవన్‌లోని జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎపి.రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య మాట్లాడుతూ జిల్లాలో వరికోతలు ప్రారంభమైయ్యాయని, బిపిటీలు, షుగర్ లెస్ ధాన్యానికి కొనుగోలు చేసే ధర రైతాంగానికి ఊరట కలిగిస్తున్నప్పటికీ మసూరి ధాన్యం కొనుగోలు ధర తగ్గించడం, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే తక్కువకు కొనుగోలు చేయడంతో రైతాంగం నష్టపోతుందన్నారు. ప్రభుత్వం ఈ సమస్యపై స్పందించి రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి మసూరి ధాన్యం కొనుగోలు మద్దతు ధరలకే కొనుగోలు చేసే విధంగా పటిష్టంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాల కారణంగా రైతులు నష్టపోతున్నారని, తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలకే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏ.పి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తుళ్లూరు గోపాల్ మాట్లాడుతూ జిల్లాలో ఆరు లక్షల ఎకరాల్లో వరి సాగుబడి ఉందని, ఈ సాగుబడిలో కౌలు రైతులు ఎక్కువ మంది ఉన్నారన్నారు. మాండూస్ తుఫాన్ కారణంగా ఈ కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారని, కష్టపడి తిరిగి మరలా రెండవ సారి నారుమడులు వేసి పంట సాగుబడి చేసి ధాన్యం చేతికివచ్చే సమయంలో అకాల వర్షాల వల్ల నష్టపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం స్పందించి రైతులకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి ఆదుకొనే ప్రయత్నం చేయాలని డిమాండ్ చేశారు. ఏ.పి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు పి.శ్రీరాములు, చంద్ర రాజగోపాల్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ లెక్కల ప్రకారం ఆరు లక్షల ఎకరాల్లో , అనధికారికంగా లెక్కలు తీసుకుంటే ఎనిమిది లక్షల ఎకరాల్లో వరిసాగుబడి జరుగుతుందన్నారు. దాదాపుగా 25 లక్షల పుట్ల వరిధాన్యం జిల్లాలో ఉత్పత్తి అవుతుందన్నారు. గతంలో జిల్లా రైతాంగం నుంచి 2 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రకటించినప్పటికీ ఒకటిన్నర టన్నుల ధాన్యం మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి నగదు ఆరు నెలలకు కూడా అందజేయలేదన్నారు. సివిల్ సప్లైస్ విభాగంలో వంద కోట్ల కుంభకోణం బయటపడిందన్నారు. ఈ ఏడాది వరిధాన్యంలో కొన్ని రకాలకు మద్దతు ధర లభించిందన్నారు. అకాల వర్షాల కారణంగా అనేక రకాల పంటలు వరి, మిర్చి, పొగాకు తదితర పంటలు దెబ్బతిన్నాయన్నారు. ప్రభుత్వం ఈ నష్టాన్ని అంచనా వేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపి కౌలు రైతు సంఘం నాయకులు పొట్టేపాళెం చంద్రమౌళి, గండవరపు బుజ్జయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రైతు సంఘాల నాయకులు

సిఐ నాగేశ్వరరావు హఠాన్మరణం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మల్లి నాగేశ్వరరావు (48) గుండెపోటుతో మతి చెందారు. సోమవారం మధ్యాహ్నం 2:30 గంటలకు గుండె నొప్పిగా ఉందని ఆయన భార్యతో చెప్పాడు. వెంటనే ఆమె ఎస్ఐకు ఫోన్ చేసి విషయం చెప్పింది. ఎస్ఐ హుటా హుటిన అంబులెన్స్ తీసుకొని స్థానిక అభిరామ్ ఆస్పత్రికి సిఐని తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మూడు గంటల ప్రాంతంలో మతి చెందారని వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య వెంకటలక్ష్మి, కుమారుడు అంజనీ కుమార్ ఉన్నారు.సిఐ మృతిచెం దడంతో భార్య కన్నీరుమున్నీరయ్యింది.

మృతుడు సిఐ పోలీస్ హెడ్ క్వార్టర్ మంగళగిరి నుంచి ఆర్నెల్ల క్రితం ఆత్మకూరు సిఐగా వచ్చారు. ఈ ఆర్నెల్లలు ఆత్మకూరు సర్కిల్ పరిధిలో విధి నిర్వహణలో మంచి పేరు ప్రతిష్టలు సంపాదించుకున్నారు. సాయంత్రం ఎస్పి విజయారావు ఆత్మకూరు పట్టణానికి చేరుకొని భౌతికకాయానికి నివాళులర్పించారు. ఎఎస్పి హైమావతి, క్రైం ఎఎస్పి ప్రసాదరావు, ఆత్మకూరు డిఎస్పి కోటారెడ్డి, ఎస్ఐలు శివశంకరరావు, సాయి ప్రసాద్, ఆత్మకూరు ఆర్‌డిఒ కరుణ కుమారి, మున్సిపల్ కమిషనర్ ఎం.రమేష్ బాబు, తదితర రాజకీయ నాయకులు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.


సిఐ భౌతికఖాయానికి నివాళి అర్పిస్తున్న ఎస్‌పి విజయరావు , పోలీస్ అధికారులు

టిడిపి నాయకులు అరెస్టు

ప్రజాశక్తి -కందుకూరు : వైసిపి ప్రభుత్వం ప్రతిపక్షాలు, ప్రజాసంఘాల నాయకులే టార్గెట్‌గా రాక్షసపాలన సాగిస్తుందని నెల్లూరు పార్లమెంటు టిడిపి అధికార ప్రతినిధి గోచిపాతల మోషే విమర్శించారు. విపక్షాల గొంతు నొక్కే జిఒ నెంబర్ 1ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో సోమవారం శాసన సభ దగ్గర గాంధేయ మార్గంలో నిరసన తెలియజేయడానికి వెళుతున్న టిడిపి నాయకులను ముందస్తుగా అక్రమ అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉంచడాన్ని మోషే తప్పుపట్టారు. కందుకూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహ కార్యదర్శి చదలవాడ కొండయ్య, కందుకూరు పట్టణం స్టేషన్‌లో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొంతమందిని ఉంచారు.

తోటపల్లిగూడూరు : ప్రజా ఉద్యమాలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని సిపిఎం మండల కార్యదర్శి వేగూరు వెంకయ్య విమర్శించారు. జిఒ నెంబర్ 1 కి వ్యతిరేకంగా, అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం అంగన్‌వాడీలు చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టారు. దీంతో సోమ వారం పోలీసులు కార్యక్రమానికి వెళ్లకుండా అడ్డుకొన్నారు. చలో విజయవాడకు అనుమతి లేదని ఎస్ఐ ఇంద్రసేనా రెడ్డి రాజా, వెంకయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు కాల్తిరెడ్డి రవణమ్మ పచ్చ మధులకు నోటీసులు అందజేశారు. అనంతరం రాజాను అదుపులోకి తీసుకున్నారు.

టిడిపి ఎంఎల్ఎలపై దాడి హేయం

ప్రజాశక్తి -ఉలవపాడు : ఎంఎల్ఎలపై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కందుకూరు నియోజకవర్గ టిడిపి కల్చరల్ ప్రధాన కార్యదర్శి చింతల సింగయ్య డిమాండ్ చేశారు. మంచి వ్యక్తిగా, వివాదరహితుడిగా పేరున్న ఎంఎల్ఎ బాల వీరాంజనేయ స్వామి, సీనియర్ నేత బుచ్చయ్య చౌదరి పై అసెంబ్లీలో వైసిపి ఎంఎల్ఎ ఎమ్మెల్యే సుధాకర్ బాబు, మరి కొంతమంది వైసిపి ఎమ్మెల్యేలు దాడి చేయటం దుర్మార్గమైన చర్య అన్నారు. రాష్ట్ర శాసనసభలో ఎంఎల్ఎ సుధాకర్ బాబు పై టిడిపి సభ్యులు చేసిన దాడిని యావత్తు రాష్ట్ర దళితులపై చేసిన దాడిగా భావించాల్సి ఉంటుందని ఉలవపాడు మండల జేసీఎస్ కన్వీనర్ వెలిచెర్ల ధనకోటి పేర్కొన్నారు. దళిత నేతపై దాడి చేసిన టిడిపి ఎంఎల్ఎలను శిక్షించాలన్నారు.

పంట పొలాలు పరిశీలన

తోటపల్లిగూడూరు : కురిసిన వర్షాలకు నేల వాలిన వరి పైర్లను వ్యవసాయ శాఖ అధికారులు పర్యటించారు. సోమవారం మండల వ్యవసాయ శాఖ అధికారి యు. గీతాకుమారి ఆధ్వర్యంలో ఇందుకూరుపేట వ్యవసాయ సహాయ సంచాలకులు ఎ. రాజ్ కుమార్, డిడిఎ శివన్నారాయణ, కె.వి.కె శాస్త్రవేత్తలు లలిత, శివ జ్యోతి, ఏఓ శ్రీనివాస చక్రవర్తి మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు కురిసిన వర్షాలకు నేల వాలిన వరి పైర్ల విషయంలో తీసుకోవాల్సిన చర్యలు గురించి వివరించారు. ముందుగా పొలంలో చేరిన వర్షం నీటిని బయటకు తరలించాలని తెలిపారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

పొదలకూరు : పొదలకూరు డివిజన్ ఎడిఎ కె. శివ నాయక్ ఆధ్వర్యంలో మండలంలోని మరుపూరు, తోడేరు గ్రామాల్లో అకాల వర్షాల వస్తున్న నేపథ్యంలో పరిశీలించారు. కృషి విజ్ఞాన కేంద్రం నెల్లూరు సమన్వయ కర్త డా. జి.ఎల్. శివ జ్యోతి మాట్లాడుతూ రైతులందరూ తప్పని సరిగా వరి పొలాల్లో నిల్వ ఉన్న నీరు బయటకు పంపే మార్గం చేయాలని సూచించారచు. ఒక లీటర్ నీటికి 50 గ్రా. ఉప్పుని కలుపుకొని పిచికారి చేయాలని సూచించారు. శాస్త్రవేత్త డాక్టర్ డి. విజయ్ కుమార్ నాయక్ మాట్లాడారు. వ్యవసాయ అధికారులు ఉన్నారు.

'అపోలో'లో అత్యాధునిక స్కానింగ్ సేవలు

ప్రజాశక్తి-నెల్లూరు : అపోలో హాస్పిటల్ లో ఉమెన్స్ డే ని పురస్కరించుకొని డిఈఎక్స్ఎ స్కానింగ్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చామని ఆ వైద్యశాల మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాం సతీష్ తెలిపారు. సోమవారం అపోలో వైద్యశాల మీటింగ్ హాల్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ వైద్యశాలలో ఏర్పాటు చేసిన అత్యంత అధునాతనమైన డిఈఎక్స్ఎ స్కానింగ్ పరికరంతో పరీక్షలు చేయడం ద్వారా ఎముకలు ఏ మేరకు బలంగా ఉన్నాయో, ఎంత శాతం బలహీనపడ్డాయో గుర్తించడం సాధ్యమౌతుందన్నారు. జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో సిఈఓ నవీన్, ఆపరేషన్ హెడ్ బాలరాజు, హెచ్ ఓడి డాక్టర్ గాయత్రి, డాక్టర్ ప్రమేష్, డాక్టర్ షబానా, డాక్టర్ అర్షియా పాల్గొన్నారు.

పెన్షనర్లు సర్టిఫికెట్లు అందజేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు : పెన్షనర్లు ఈ నెల 22వ తేదిలోగా తమ లైఫ్ సర్టిఫికేట్లను అందజేయాలని డివిజనల్ సబ్ ట్రెజరీ అసిస్టెంట్ ట్రెజరీ అధికారి పేర్కొన్నారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ట్రెజరీ అధికారి ముఖ్యఅతిధిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు ఎస్ఎం గౌస్ మాట్లాడారు. అసోసియేషన్ రాష్ట్ర సంఘం వైస్ ప్రెసిడెంట్ ఎ.రమణయ్య, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులను ఖండిస్తూ అంగన్‌వాడీలు నిరసన



నెల్లూరులో...

ప్రజాశక్తి-నెల్లూరు : అంగన్‌వాడీలు తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా నేడు నిర్వహించ తలపెట్టిన 'చలో విజయవాడ' కార్యక్రమంలో పాల్గొనేందుకు బయలుదేరి వెళ్తున్న వారిని ఎక్కడికక్కడే అరెస్టులు చేయడం దారుణమని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ పేర్కొంది. సోమవారం నగరంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో ఆ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ప్రభుత్వం చేపట్టిన అక్రమ అరెస్టులకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమానికి సిఐటియు సంపూర్ణ మద్దతు తెలియజేసింది. సిఐటియు నగర కార్యదర్శి జి . నాగేశ్వర రావు మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొంటున్న సిఎం దృష్టికి తమ సమస్యలు తీసుకెళ్ళి పరిష్కరించుకోవాలని ఆలోచన చేసి శాంతియుతంగా కార్యక్రమం నిర్వహించేందుకు ప్రయత్నిస్తే ప్రభుత్వం ఆ ప్రయత్నాన్ని భగ్నం చేసేందుకు కుట్రపూరితంగా వ్యవహరించిందన్నారు. ఇది ప్రభుత్వ చర్య పిరికిపంద చర్యలన్నారు. తెలంగాణలో2021నుంచి అంగన్‌వాడీలకు రూ.13,650లు వేతనంగా అందజేస్తుంటే వైసిపి ప్రభుత్వం రూ. 11,500 లు అందజేయడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. అంగన్‌వాడీలకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటి ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 ఐదు లక్షలు అందజేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు రూరల్ కార్యదర్శి కిన్నెర కుమార్, ఐద్వా నగర కార్యదర్శి కె. పద్మ డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బిపి నరసింహ, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు కామాక్షమ్మ, సంపూర్ణమ్మ, మైదిలి, శైలజ మల్లెమ్మ, కళ్యాణి, మాధవి ఐద్వా నాయకులు కుమారమ్మ, రెహను, డివైఎఫ్ఐ నాయకులు కర్తం బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉలవపాడు : అంగన్‌వాడీల తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమం సందర్భంగా ప్రభుత్వం అంగన్ వాడీలపై పోలీసులను ప్రయోగించి వారిపై దమనకాండ చేసి అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఉలవపాడులోని అంబేద్కర్ బొమ్మ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సిఐటియు జిల్లా నాయకులు జీవీబీకుమార్ మాట్లాడారు. సిఐటియు ఉలవపాడు మండల అధ్యక్షులు వాకా లతారెడ్డి, అంగన్వాడీలు ఉన్నారు.

గుడ్లూరు : చలో విజయవాడ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీలను అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో అంగన్ వాడీలు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ మండల కమిటీ నాయకులు పి. మాంచాలి మాట్లాడారు. అంగన్‌వాడీలు జ్యోతి, ఎస్తేరమ్మ శారద, సునీత, చిన్నమ్మాయి, భూలక్ష్మి, ఝాన్సీ, అన్నపూర్ణ ఉన్నారు.

తోటపల్లిగూడూరు : సమస్యల పరిష్కారం కోసం చలో విజయవాడ వెళ్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లను అరెస్ట్ చేయడం అక్రమమని సిఐటియు మండల కార్యదర్శి మారుబోయిన రాజా పేర్కొన్నారు. అంగన్‌వాడీల అరెస్టులను ఖండిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం తోటపల్లిగూడూరు మండలం నరుకూరు సెంటర్లో నిరసన చేపట్టారు. రాజా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు నిలబెట్టుకోలేదని విమర్శించారు. సమాన పనికి సమాన వేతనం 26,000 ఇవ్వాలని కోరడం అన్యాయమా అని అయన ప్రశ్నించారు. అంగన్వాడి మండల కార్యదర్శి మస్తానమ్మ, అనిత, కవిత, అనురాధ, మాధవి, హరికుమారి, మంజుల, నరుకూరు సెంటర్ ఆటో యూనియన్ ట్రెజరర్ శివ, సహాయ కార్యదర్శి గోపి, ఉపాధ్యక్షుడు వెంకట శేషయ్య, రవి, ఎస్.కె. బాబు, రఘు ఉన్నారు.


గుడ్లూరులో..



ఉలవపాడులో...



తోటపల్లి గూడూరులో..

'స్పందన' అర్జీలకు పరిష్కారం

ప్రజాశక్తి-నెల్లూరు : స్పందన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని తిక్కన ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు, సంయుక్త కలెక్టర్ రోణంకి కూర్మనాద్, డిఆర్ఓ వెంకటనారాయణమ్మలతో కలిసి స్పందన కార్యక్రమం నిర్వహించి వివిధ ప్రాంతాల ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సంబంధిత శాఖల జిల్లా అధికారులను పిలిపించి అర్జీల పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

ప్రజలు ఛీత్కరించినా వైసిపికి సిగ్గు రాలేదు..!

టిడిపి నేత ఇంటూరి రాజేష్ - టిడిపి ఎంఎల్ఎలపై దాడికి ఖండన

ప్రజాశక్తి -కందుకూరు


దళిత ఎంఎల్ఎ స్వామిపై అసెంబ్లీ సాక్షిగా వైసిపి ఎంఎల్ఎ సుధాకర్ బాబు దాడి చేయడం అత్యంత దుర్మార్గమైన విషయమని, వచ్చే ఎన్నికల్లో వైసిపి నామరూపాలు లేకుండా పోవడం ఖాయమని నెల్లూరు పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షులు ఇంటూరి రాజేష్ పేర్కొన్నారు. సోమవారం ఆయన ఇక్కడ విలేకర్లతో మాట్లాడారు. వైసిపి నీచ సంస్కృతిని ప్రజలు బాగా అర్థం చేసుకున్నారన్నారు. అందుకే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కర్రు కాల్చి వాత పెట్టారన్నారు. అసెంబ్లీ సాక్షిగా దళిత టిడిపి ఎంఎల్ఎ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, సీనియర్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరిపై వైసిపి ఎంఎల్ఎ టిజెఆర్ సుధాకర్ బాబు దాడి చేయడం దుర్మార్గమన్నారు. దాడి చేసినవారిపై చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపికి సమాధి కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. తక్షణమే టిడిపి ఎంఎల్ఎలకు సుధాకర్ బాబు, ఇతర వైసిపి ఎంఎల్ఎల ఎంఎల్ఎలు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న ఇంటూరి రాజేష్

ప్రజాస్వామ్యంపై దాడి

ఇంటూరి నాగేశ్వరరావు

టిడిపి దళిత ఎంఎల్ఎ డోలా బాల వీరాం జనేయ స్వామి, సీనియర్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరిలపై వైసిపి ఎంఎల్ఎలు గూండాలు మాదిరిగా దాడి చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకే కళంకం ఆని కందుకూరు నియోజ కవర్గం టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన ఇక్కడ మాట్లా డారు. అసెంబ్లీలో టిడిపి ఎంఎల్ ఎలపై జరిగిన దాడిని ఆయన ఖండించారు. వైసిపి ఫ్యాక్షన్ మెంటాలిటీని అసెంబ్లీలోనే చూపించిందన్నారు. ఇది ప్రజాస్వామ్యంపై దాడి అన్నారు. టిడిపి ఎంఎల్ఎలపై దాడిచేసిన వారిపై వెంటనే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న టిడిపి నేత ఇంటూరి నాగేశ్వరరావు

చంద్రబాబుతో టిడిపి నేతలు సమావేశం

ప్రజాశక్తి -కందుకూరు : మంగళగిరిలోని టిడిపి జాతీయ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్, కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ ఎంఎల్ఎ దివి శివరాం, క్లస్టర్ ఇన్‌ఛార్జులు మరో 50 మందికి పైగా నాయకులు పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుని సోమవారం కలిశారు. శ్రీకాంత్ గెలుపు కోసం శ్రమించిన కందుకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావుని, నియోజకవర్గంలోని పార్టీ నేతలు, కార్యకర్తలను చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఇంటూరి నాగేశ్వరరావు పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎంఎల్‌సి భూమిరెడ్డి రాంభూపాల్ రెడ్డి, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎంఎల్‌సి చిరంజీవి రావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెంనాయుడు, ఉమ్మడి ప్రకాశం జిల్లా నేతలతో కలిసి నాగేశ్వరరావు పలు విషయాలపై చర్చించారు. కందుకూరు పట్టణ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, ఉలవపాడు మండల అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, కందుకూరు మండల అధ్యక్షులు నార్నే రోశయ్య, రాష్ట్ర కమిటీ నాయకులు చిలకపాటి మధు, పలువురు మహిళా నేతలుఉన్నారు.


ఎంఎల్‌సి రాంభూపాల్‌రెడ్డికి అభినందనలు తెలుపుతున్న ఇంటూరి

పేద విద్యార్థులకు సాయం

తోటపల్లిగూడూరు : మండలంలోని పొట్లపూడి గ్రామంలోని ప్రాథమికొన్నత పాఠశాల విద్యార్థులకు సర్పంచ్ చిల్లకూరు ప్రసూన సోమవారం ఆహారం అందజేశారు. పాఠశాలలో చదువుతున్న 150 పేద విద్యార్థులు భోజనం కోసం ఎదురు చుడాల్సి వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ చిల్లకూరు ప్రసూన ఆహారం వండుకొని పాఠశాలకు వచ్చి వడ్డించారు. దీంతో ఆమెను పలువురు అభి.నందించారు. స్థానిక వైసిపి నాయకులు, విజయ డైరీ మాజీ చైర్మన్ సుధీర్ రెడ్డి పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

ప్రజాశక్తి-నెల్లూరు : నగరంలో ఇటీవల కాలంలో పలు ఆటోలు, బ్యాటరీలు, టైర్లు, సెల్ఫ్ మోటార్లు చోరీకి గురైయ్యాయని, వాటిని రికవరీ చేయించి అందజేసి ఆటోడ్రైవర్లను ఆదుకోవాలంటూ కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమంలో జిల్లా ఆటో కార్మిక సంఘం నాయకులు జిల్లా అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మారుబోయిన రాజా కోలగట్ల, సురేష్‌లు మాట్లాడారు. నెల్లూరు జిల్లా ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మారుబోయిన రాజా కోలగట్ల, సురేష్ జిల్లా కమిటీ సభ్యులు రాజుపాలెం సురేష్ , బుచ్చి రాధయ్య ఇందుకూరుపేట మనోహర్, ముత్తుకూరు శ్రీనివాసులు పాల్గోన్నారు.


వన్యప్రాణుల సంరక్షణకు కృషి

నెల్లూరు : అటవీ భూముల పరిరక్షణకు, వన్య ప్రాణ సంరక్షణకు అన్నీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్. చక్రధర్ బాబు, అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి అటవీ, వన్యప్రాణి సంరక్షణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ చక్రధర్ బాబు,ఎస్.పి సి.హెచ్. విజయ రావు, జాయింట్ కలెక్టర్ ఆర్. కూర్మనాథ్ లతో కలసి జిల్లాలో అటవీ భూముల పరిరక్షణకు, వన్య ప్రాణ సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. నగర పాలక సంస్థ కమీషనర్ హరిత, కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక, అడిషనల్ ఎస్.పి హిమావతి, ఆత్మకూరు, కావలి ఆర్.డి.ఓ లు మలోల, శీనా నాయక్, జడ్పీ సీఈవో బి. చిరంజీవి, డిఆర్డీఏ, డ్వామా పిడిలు సాంబశివారెడ్డి ఉన్నారు.

సిఎంను కలిసిన ఎంఎల్‌సి 'పర్వతరెడ్డి'

ప్రజాశక్తి-నెల్లూరు

నూతనంగా ఎన్నికైన ఎంఎల్‌సి పర్వతరెడ్డి చంద్రశేఖరెడ్డి సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగోన్మహన్‌రెడ్డిని కలిశారు. ఆయన వెంట కల్పలత రెడ్డి, రామ చంద్రా ఉన్నారు. కార్యక్రమంలో పర్వతరెడ్డి కుటుంబ సభ్యులు ఉన్నారు.


ముఖ్యమంత్రిని కలిసిన చంద్రశేఖర్‌రెడ్డి

ఇంటి పన్నులు సకాలంలో చెల్లించండి

ప్రజాశక్తి-అల్లూరు : నగర పంచాయతీలో ప్రతిఒక్కరూ బాధ్యతగా ఇంటి పన్నులు చెల్లించాలని నగర పంచాయతీ కమిషనర్ ఫణికుమార్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రం నగర పంచాయతీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జిఒ ఎంఎస్ 34, 16-03-2023 ప్రకారం మార్చి 31 నాటికి ఇంటి పన్నులు సకాలంలో చెల్లిస్తే ప్రతిఒక్కరికి రాయితీ ఇస్తామని తెలియజేశారు. కట్టే ఇంటి పన్నులతో నగర పంచాయతీ అభివృద్ధి చెందుతుందన్నారు. బాధ్యత కలిగిన అందరూ ఇంటి పన్నులు చెల్లించేందుకు కృషి చేయాలని కోరారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : స్థానిక ఉద్యానవన కేంద్ర దార్ల సంస్థలో సోమవారం శనగ కొనుగోలు కేంద్రం ప్రారంభించినట్లు ఎపిడిఒ బొర్రా సురేష్ రెడ్డి, ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. నెల్లూరు మార్క్‌ఫెడ్ మేనేజర్ పవన్ మాట్లాడుతూ నాణ్యత గల క్వింటాల్ రూ.5530 ధర నిర్ణయించామని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రజనీ, విఇఒ చిరంజీవి, డిటి సతీష్, తదితరులున్నారు.

లబ్ధిదారుల ఎంపికపై అవగాహన

ప్రజాశక్తి-సీతారామపురం : డిఆర్‌డిఎ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు పిఎంజెపి / పిఎంఎస్‌ఎంజెకు సంబంధించి మిషన్ పంపిణీ కోసం అర్హులైన లబ్ధిదారులను ఎంపికపై చేసుకోవడం కోసం డిఆర్‌డిఎ వెలుగు ఎపిఎం బిడ్డుల సుధాకర్ రావు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఉద్యోగినీ ఏరియా కోఆర్డినేటర్ శేషారెడ్డి మాట్లాడుతూ ప్రధానంగా స్థిరమైన జీవనోపాధిని ఏర్పాటు చేసుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో లక్షకు రూ.35వేలు సబ్సిడీ రుణాలను పొందుపు మహిళలకు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. దీనికి సంబంధించి ప్రతి పేద మహిళ ఒక జీవనోపాధిని పొందించుకొని దాని ద్వారా నెలకు రూ.10వేలు ఆదాయం వచ్చే విధంగా తన కుటుంబం ఆర్థికంగా ఎదగాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ పథకాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో జీవనోపాధి అధికారి శ్రీనివాసులు, పొదుపు సంఘం మహిళలు, విఒఎలు, సిసిలు, ఎల్‌పిఒ, సిసిలు తదితరులున్నారు.

క్వారీ అనుమతులకు ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి-సంగం : స్థానిక సచివాలయంలో ఆర్‌డిఒ కరుణకుమారి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇంజనీర్ రాజశేఖర్ క్వారీ అనుమతులకు పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా అధికారులు క్వారీ అనుమతులను సంబంధించిన విధివిధానాలను ప్రజలకు వివరించారు. కొంతమంది క్వారీ కావాలని, కొంతమంది తమకు వద్దు అంటూ నినాదాలు చేశారు. కొద్దిసేపు ప్రజాభిప్రాయ సేకరణలో గందరగోళం నెలకొంది. ఎసిఐ నాగార్జునరెడ్డి అక్కడికి చేరుకుని సర్దుబాటు చేశారు. తహశీల్దార్ లక్ష్మీ ప్రసన్న, వైసిపి నాయకులు కర్నాటి రవీంద్రారెడ్డి, కంటలురెడ్డి రఘునాథ్ రెడ్డి, కాకు మధుసూధన్, ప్రజలు పాల్గొన్నారు.

మల్లేశ్వరరావుకు ఉగాది పురస్కారం

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణానికి చెందిన ప్రముఖ నాటక రచయిత, నటుడు, దర్శకులు, నాటక పోటీల నిర్వాహకులు ఎ వి మల్లేశ్వరరావు హరివిల్లు పురస్కారం అందుకున్నారు. ఆదివారం నెల్లూరు టౌన్ హాల్‌లో జరిగిన హరివిల్లు ఉగాది పురస్కారోత్సవ కార్యక్రమంలో ప్రముఖ సినీ హాస్యనటులు గౌతమ్‌రాజు, కళాపోషకులు అమరావతి కృష్ణారెడ్డి, కోసూరు రత్నం, హరిబాబు, డాక్టర్ హరిప్రసాద్ తదితరుల చేతుల మీదుగా ఈ పురస్కార ప్రదానం జరిగింది. ఈ సందర్భంగా తనను ప్రోత్సహించిన కావలి శాతావాహన, విశ్వోదయ వ్యవస్థాపకులు డాక్టర్ దొడ్ల రామచంద్రా రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

పౌష్టికాహార మాసోత్సవం

ప్రజాశక్తి-ఉదయగిరి : పౌష్టికాహార మాసోత్సవాన్ని సిడిపిఒ పద్మావ లావణ్య ప్రారంభించారు. సోమవారం స్థానిక ఆరోగ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆమె ఈ కార్యక్రమం ప్రారంభించి మాట్లాడుతూ ఈ కార్యక్రమాను కేంద్ర ప్రభుత్వం సూచన మేరకు పోషణ పక్షోత్ కార్యక్రమంతో సిడిపిఒ పరిధిలోని అన్ని అంగన్‌వాడీ సెంటర్లలో నిర్వహించాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు, ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల్లో పరిశీలన

ప్రజాశక్తి-ఉదయగిరి : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి పరీక్ష కేంద్రాల ఏర్పాటును సోమవారం విఇఒ షేక్ మస్తాన్‌వలీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఏప్రిల్ 3వ తేదీ నుండి 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగుచున్న నేపథ్యంలో ఎంపికైన సెయింట్ మేరీస్ ప్రయివేటు ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని భౌతిక వసతులైన బిల్డింగ్స్, డ్యూయల్ డస్కులు, ఫర్నిచర్, కాంపౌండ్ వాల్, తాగునీటి సదుపాయం, టాయిలెట్స్, ఎలక్ట్రిసిటీ, ట్యూబ్లైట్స్, ఫాన్స్ ఇతర సదుపాయాలు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉన్నాయో లేదా అని పరిశీలించారు. హెడ్‌మిస్ సిస్టర్ రాజశ్రీ, ఉపాధ్యాయులు నాగవర్ధన్ పాల్గొన్నారు.

ఆంధ్రా క్రీడాకారుల ప్రతిభ



ప్రజాశక్తి-కోవూరు : రాజస్థాన్లోని జైపూర్‌లో మార్చిలో మూడు రోజుల పాటు నిర్వహించిన రెండవ స్మాష్ రాకెట్ జాతీయస్థాయి సీనియర్ పురుషుల, మహిళల డబుల్ పోటీలలో ఆంధ్ర మహిళా జట్టు తొలిసారిగా పాల్గొని ప్రతిభ కనపరిచి జాతీయస్థాయిలో మూడవ స్థానం కైవసం చేసుకున్నారు. వీరికి కప్పుతో పాటు ప్రశంసా, కాంస్య పతకాలు అందుకున్నారు.

గోతాలు పంపిణీ

ప్రజాశక్తి-జలదంకి : ఆర్.బి.కె. కేంద్రం ద్వారా ధాన్యాన్ని అమ్ముకునే రైతులకు అవసరమైన గోతాలను అందజేస్తున్నట్లు అన్నవరం ఆర్‌బికె కొనుగోలు కేంద్రం ఇన్‌ఛార్జి టి.హరికృష్ణ తెలిపారు. రైతులు తాము పండించిన ధాన్యాన్ని ఆర్బికే కేంద్రాల ద్వారా అమ్ముకోవాలని తెలిపారు. రైతులు దళారులను నమ్మి నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం తగు చర్యలు చేపట్టిందన్నారు. అందులో భాగంగా రైతులకు అవసరమైన గోతాలను పంపిణీ చేస్తున్నామన్నారు.

705పొగాకు బేళ్లు కొనుగోలు

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని డిసిపల్లి పొగాకు వేలం కేంద్రానికి నెల్లూరు పాలెం క్లస్టర్‌కు చెందిన రైతులు 728పొగాకు బేళ్లను రైతులు తీసుకురాగా వీటిలో 705బేళ్లను పలు కంపెనీలకు చెందిన వ్యాపారస్థులు కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వివిధ కారణాలతో 08పొగాకు బేళ్లను తిరస్కరించారన్నారు. వీటిలో సిఆర్ 08ఉన్నాయని, అధిక బరువు కలిగి ఉండడంతో 15బేళ్లను తిరస్కరించారని తెలిపారు.

అక్రమ అరెస్టులకు సిఐటియు నిరసన



కావలిలో...



మర్రిపాడులో...

ప్రజాశక్తి-కావలి

అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) 20వ తేదీన ఇచ్చిన "చలో విజయవాడ" కార్యక్రమానికి వెళ్లకుండా రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుంటూ పోలీసులతో ముందస్తు నోటీసులు ఇప్పించి కార్యక్రమానికి పోయే వారిని ఎక్కడికక్కడ పోలీస్ స్టేషన్లలో నిర్బంధించడాన్ని ఖండిస్తూ, సోమవారం ఉదయగిరి రోడ్డు కూడలిలో అంబేద్కర్ బొమ్మ వద్ద అంగన్‌వాడీ వర్కర్లు సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ఎన్నోసార్లు అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయినప్పటికీ పరిష్కరించకుండా కాలయాపన చేస్తూ హామీలను అమలు చేయకుండా వర్కర్లపై పనిభారాన్ని పెంచుతున్నందున సమస్యలు పరిష్కరించాలని "చలో విజయవాడ" కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విఫలం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవడం చాలా దుర్మార్గమైన చర్య అని ఇలాంటి ఆలోచనలను ప్రభుత్వ మానుకోవాలని వెంటనే అంగన్‌వాడీ వర్కర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిఐటియు పట్టణ కార్యదర్శి వై.కృష్ణమోహన్ మాట్లాడుతూ అక్రమ అరెస్టులను సిఐటియు తీవ్రంగా ఖండిస్తుందన్నారు. అంగన్‌వాడీ వర్కర్ల న్యాయమైన సమస్యలు అన్నింటిని పరిష్కరించాలని, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం వేతనాలు ఇవ్వాలని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని, గ్రాట్యూటి ఇవ్వాలని వర్కర్ల ముఖ యాప్‌ను రద్దు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్, సెంటర్లుగా మార్చాలని, వర్కర్ల పనిభారాన్ని తగ్గించాలని, పెండింగ్ బిల్లులను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే రాబోవు రోజులలో పెద్దఎత్తున పోరాటాలను కొనసాగిస్తామని హెచ్చరించారు. సిఐటియు నాయకులు బి.కృష్ణయ్య, షేక్.అమీర్ బాషా, అంగన్‌వాడీ నాయకులు గద్దగుంట సుజాత, కసుపర్తి వరలక్ష్మి, కామేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అనంతసాగరం : అంగన్‌వాడీలు తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని రాజధానికి వెళ్లిన వారిని రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని మండల సిఐటియు ఖండించింది. ఈ సందర్భంగా మండల కార్యదర్శి అన్వర్ భాషా మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి తన పాదయాత్ర సందర్భంగా వారి పెంచుతామని హామీనిచ్చి ఇప్పుడు ఇబ్బందులు పెట్టడం దారుణమన్నారు. తమ కోర్కెలు పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా కదలిన అంగన్‌వాడీలను మధ్యలో అడ్డుకొని పోలీస్ స్టేషన్‌లకు తరలించడం సిగ్గుచేటన్నారు. అంగన్‌వాడీలకు తెలంగాణ కన్నా అదనంగా వేతనాలుపెంచి, గ్రాట్యుటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి అంగన్‌వాడీలు త్వరలోనే తగిన బుద్ధిచెబుతారన్నారు.

మిడ్డే మీల్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-మర్రిపాడు : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర, జిల్లా కమిటీల మేరకు సిఐటియు నాయకులు మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం ఎంఇఒ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం సిఐటియు మండల కార్యదర్శి బత్తల రత్నయ్య పాల్గొని మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకాన్ని 20 ఏళ్ల నుండి నిర్వహిస్తున్నా ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించలేదని విమర్శించారు. ప్రతి కార్మికురాలికి నెలకు రూ.26వేలు వేతనం ఇవ్వాలని, పెరుగుతున్న ధరలకు అనుకూలంగా మెనూ ఛార్జీలు పెంచాలని ప్రతి విద్యార్థికి రూ.15 చొప్పున ఇవ్వాలని, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేసి గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. అలాగే కార్మికులకు రెండు జతల యూనిఫారం, ప్రమాద బీమా సౌకర్యం కల్పించి గోరుముద్ద మెనూ ఛార్జీలను పెంచి, కార్మికులపై రాజకీయ నాయకుల ఒత్తిడి లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. వారికి ప్రతినెలా జీతాలు, బిల్లులు సకాలంలో ఇచ్చి వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. విద్యార్థులకు రాగిజావ పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించగా ఇప్పటికే నిత్యావసర వస్తువులు, గ్యాస్ ధరలు పెరిగడంతో మెనూఛార్జీలు పెంచి వాటిని నెలనెలా తమ ఖాతాలలో నగదు జమచేస్తేనే రాగిజావ పెడతామని లేనియెడల కష్టంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రహంతుల్లా, భోజన కార్మికులు పాల్గొన్నారు.

భూ సమస్యపై ఆర్‌డిఒకు వినతి

ప్రజాశక్తి-కావలి

బోగోలు మండలం పాత బిట్రగుంట అరుంధతీయవాడ గ్రామానికి చెందిన పలువురు దళిత సంఘర్షణ సమితి అధ్యక్షులు మల్లి, తదితరులు కలిసి గ్రామస్త భూమి గురించి ఆర్‌డిఒకి సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ అనుభవంలో ఉన్న గ్రామస్త భూమిని దౌర్జన్యంగా గ్రామస్థులైన వాకా బాలిరెడ్డి ఆక్రమించుకుంటున్నారని తగిన చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఒను విన్నవించారు. తమకు దాదాపుగా 70 సంవత్సరాల నుండి గ్రామ అవసరాలకు వాడుకుంటున్నామని అందులో గడ్డివాములు పశువుల కొట్టాలు ఇతర వాటికి వినియోగించుకుంటున్నామని తెలియజేశారు. అయితే ఈమధ్య ఆడిగి కొంతకాలం వాకా బాలిరెడ్డి కొంత భాగంలో గడ్డివాములు వేసుకుంటున్నారని తెలియజేశారు. ప్రస్తుతం భూమి అంతా తనదే అని అంటున్నారని వాపోయారు. వారి ఊరు చాలా దూరం అని, కాలనీలో స్థలాన్ని ఆక్రమించుకొని గడ్డివాములు వేసుకుంటున్నారని తెలియజేశారు. తాము ఎన్నిసార్లు చెప్పినా వినడం లేదని ఈ మేరకు కలెక్టర్ దృష్టికి తహశీల్దార్ దృష్టికి తీసుకొని వెళ్లామని తెలిపారు. గ్రామస్తుల భూమి కబ్జాకి ఎవరికీ హక్కు లేదని పేర్కొన్నారు. అరుంధతీయవాడ అవసరాల కోసం ఉపయోగించుకుంటున్న భూమిని దౌర్జన్యంగా ఆక్రమించుకోవడం అన్యాయమన్నారు. కాబట్టి విచారించి తమ అనుభవంలో ఉన్న ఈ భూమిపై హక్కులు కల్పించాలన్నారు. తిరునాళ్ల ఇతరశుభకార్యాలకు ఉపయోగించే భూమిని ధనవంతులు గడ్డివాములకు ఉపయోగించుకోవడం అన్యాయమని తెలియజేశారు. కార్యక్రమంలో బి.శ్రీనివాసులు, రాంబాబు, సాయి, కొండమ్మ, వెంకమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ రిజిస్ట్రేషన్లకు అధికారుల సహకారం

ప్రజాశక్తి-కావలి : కలెక్టర్ ఆదేశించినా లెక్క చేయకుండా బోగోలు మండల తహశీల్దార్, రెవెన్యూ అధికారులు తమ పొలాన్ని ఆక్రమించుకొని దొంగ రిజిస్ట్రేషన్ చేయించుకున్న బిజెపి నేత సన్నిగంటి శీనయ్యకు సహకరిస్తున్నారని రెవెన్యూ అధికారులు తమకు న్యాయం చేయకపోతే సూసైడ్ లెటర్ రాసి ఆత్మహత్య చేసుకుంటామని బోగోలు మండలం, అల్లిమడుగు పంచాయతీ తెల్లగుంట గ్రామస్తులు గడ్డం తిరపతి, వంశీ, కుమారీలు వాపోయారు. సోమవారం పట్టణంలోని జర్నలిస్ట్ క్లబ్ నందు వారు మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ తెల్లగుంట గ్రామంలో సర్వే నెంబర్ 521/2లో తమ తాతల కాలం నుంచి 10 ఎకరాల 4 సెంట్లు పొలం ఉండగా దానిలో 4 ఎకరాల పొలం గడ్డం తిరపతి పేరుపై ఉందన్నారు. అయితే తమ నాన్నకు ఆరోగ్యం బాగా లేక గత కొన్ని సంవత్సరాలుగా కావలి అంబేద్కర్ నగర్‌లో గేదలు పెట్టుకొని జీవిస్తున్నట్లు కుమారుడు గడ్డం వంశీ తెలిపారు. అయితే ఈ మధ్యకాలంలో తాము సాగు చేయకపోయే సరికి అదే గ్రామానికి చెందిన బిజెపి నేత సన్నిగంటి శీనయ్య తమ పొలాన్ని ఆక్రమించుకొని దొంగ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. అయితే విషయం తెలుసుకున్న తాము బోగోలు మండల తహశీల్దార్ లక్ష్మీనారాయణకు అర్జీ రూపంలో వివరించామన్నారు. వారు స్పందించకపోతే సమాచార చట్టం ప్రకారం గతంలో తమ భూమి వివరాలు అన్ని సేకరించామన్నారు. తాము సేకరించిన వివరాలలో తమ భూమి నాలుగు ఎకరాలుగా పొందిపరిచినట్లు ఉన్నా, రెండు ఎకరాలేనంటూ అధికారులు కులం పేరుతో దూషణలు చేస్తున్నట్లు తెలిపారు. అయితే న్యాయం కోసం తన దగ్గర ఉన్న డాక్యుమెంట్లు తీసుకుని స్పందనలో రెండుసార్లు జిల్లా కలెక్టర్‌ను కలిశామన్నారు. కలెక్టర్ స్పందించి తహశీల్దార్‌కు భూమిని కొలతలు చేయాలని ఆదేశాలు జారీ చేసినా అధికారులు స్పందించటం లేదన్నారు. బిజెపినేత సన్నిగంటి శీనయ్య ఏం చేసాడో తెలియదుకానీ రెవెన్యూ అధికారులు తమ మాట తీసుకోకపోగా దుర్భాషలాడుతున్నారని వాపోయారు. ఈ మధ్యకాలంలో తమ తల్లిదండ్రులపై ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు దాడికి ప్రయత్నించారన్నారు. తమకు ప్రాణహాని ఉందని తమ కుటుంబానికి ఏం జరిగినా వారే కారణమన్నారు. కార్యక్రమంలో శివ, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ఎంఎల్ఎలపై దాడి అమానుషం

ప్రజాశక్తి-కావలి : కొండేపి నియోజకవర్గ ఎంఎల్ఎ డోలా బాలవీరాంజనేయ స్వామిపై సంతనూతలపాడు నియోజకవర్గ ఎంఎల్ఎ సుధాకర్‌బాబు చేసిన దాడిని ఖండిస్తూ, సోమవారం కావలి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు ఆదేశాల మేరకు పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో నిరసన కార్యక్రమం చేపట్టారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌కు కావలి నియోజకవర్గం టిడిపి శ్రేణులు రాసుకున్న విన్నపాన్ని అందించారు. ఈ సందర్భంగా టిడిపి నేతలు మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా, టిడిపి ఎంఎల్ఎలపై వైసిపి రౌడీల దాడి సిగ్గుచేటని, పార్టీ దళిత ఎంఎల్ఎ డోలా బాలవీరాంజనేయ స్వామి, సీనియర్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరిలపై అధికార వైసిపి ఎంఎల్ఎలు, గూండాలు మాదిరిగా దాడి చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకే కళంకమని దుయ్యబట్టారు. మంత్రి అంబటి రాంబాబు వీధి రౌడీ కంటే ఘోరంగా ప్రవర్తించి రాజకీయాలకు కళంకంతెస్తున్నారని విరుచుకుపడ్డారు. కాకి ప్రసాద రావు, మన్నవ రవిచంద్ర, జ్యోతిబాబురావు, తటవర్తి వాసు, గుత్తికొండ కిషోర్ బాబు, పోతుగంటి శ్రీకాంత్, మంచాల ప్రసాద్, ఏగూరి చంద్ర శేఖర్, దావులూరు దేవకుమార్, కావేటి చిన్న కోటయ్య, ఉప్పాల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : ప్రతిపక్ష టిడిపి ఎంఎల్ఎలపై వైసిపి గూండాలు చేసిన దాడి అమానుషమని టిడిపి మండల కన్వీనర్ చింతనబోయిన బయన్న తీవ్రంగా ఖండించారు. సోమవారం స్థానిక బస్టాండ్ సెంటర్లో శాసనసభలో అధికార పార్టీ ఎంఎల్ఎలు ప్రతిపక్ష ఎంఎల్ఎలపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు ప్రాంతాల పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు వైసిపి బలపంచిన అభ్యర్థులను ఓడించడంతో జీవించుకోలేని ప్రతిపక్ష ఎంఎల్ఎలపై దాడి చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి అంతిమ ఘడియలు సమీపించాయని రాష్ట్ర చరిత్రలో ఈరోజును బ్లాక్ డేగా మిగిలిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ఫ్యాక్షనిస్టు మనస్థత్వం కలిగిన నాయకులు ఉండడంతో ఇలాంటి దారుణాలు జరుగుతున్నాయన్నారు. మండల మాజీ కన్వీనర్లు వెంకటస్వామి, బొజ్జ నరసింహులు, వెంకటేశ్వర్లు, ఆమ్ స్ట్రాంగ్ రాజు, మైనార్టీ నాయకులు షేక్ మహబూబ్ బాషా, బీసీ నాయకులు నరసింహారాజు, శివ కృష్ణ, రామ్మోహన్, జల్సా పాల్గొన్నారు.

రైతులను తక్షణమే ఆదుకోవాలి

ప్రజాశక్తి-జలదంకి



అకాల వర్షాల వల్ల సర్వం కోల్పోయిన రైతాంగాన్ని ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన ఆదుకోవాలని మండల రైతు సంఘం, వ్యకాసం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వారు తహశీల్దారు కార్యాలయంలో అసిస్టెంట్ కలెక్టర్ విద్యాధరికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నాలుగు రోజుల క్రితం మండలంలో కురిసిన వర్షాల వల్ల పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. అకాల వర్షాల వల్ల వరి కోతకు వచ్చిన పంటల ధాన్యం పూర్తిగా రాలిపోయిందని ఆవేదన వెలిబుచ్చారు. వరి కోతలు పూర్తియి పొలాల్లో ఉన్న ధాన్యం పూర్తిగా తడిసిపోయిందని వాపోయారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి తక్షణమే రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. అలాగే ఆర్‌బికె కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయించాలని డిమాండ్ చేశారు. తడవని ధాన్యానికి తడిసిన ధాన్యానికి ఒకే ధర వర్తించేలా పుట్టి రూ.17,500లకు తగ్గకుండా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు. అకాల వర్షాల దాటికి రాలి నేలపాలైన పొలాల రైతాంగానికి ఇన్పుట్ సబ్సిడీ అందజేసి వారిని ఆదుకోవాలని కోరారు. అలాగే రైతులకు రావాల్సిన లక్షల కోట్లు రూపాయలు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా ఉపాధ్యక్షులు తాళ్లూరు మాల్యాద్రి, రైతు సంఘం మండల ఉపాధ్యక్షులు రావి మాధవరావు, రైతు నాయకులు జిలుమూడి రవికుమార్ రెడ్డి, 'వ్యకాసం మండల కార్యదర్శి ఎం.ఆంథోనీ బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అల్లూరు : రైతులకు జరుగుతున్న అన్యాయంపై వైసిపి సర్కారుపై టిడిపి నాయకులు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ పార్టీ నాయకులు సోమవారం మండలంలోని గ్రద్దగుంట, బట్రకాగొల్లు తదితర గ్రామాలలో ఇటీవల కురిసిన అకాల వర్షానికి తీవ్రంగా నష్టపోయిన రైతులను అలాగే పంట పొలాలను పరిశీలించారు. తదుపరి తహశీల్దార్ శ్రీరామకృష్ణను కలసి ధాన్యాన్ని విక్రయించే క్రమంలో రైతులు పడుతున్న దగాను వివరించి తక్షణమే వారిని ఆదుకోవాలని తెలియజేశారు. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకులు నెల్లూరు నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ అకాల వర్షంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని విచారం వ్యక్తం చేశారు. మార్చిలో ఎన్నడూ లేని విధంగా వర్షాలు కురవడంపై చింతించారు. రైతులు పండించిన ధాన్యాన్ని 19 వేలకు కొనుగోలు చేస్తున్న నేపథ్యంలో అర్థాంతరంగా రూ.16వేలకు కొనుగోలు చేస్తూ రైతుల నడ్డి విరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ జెడ్‌పిటిసి, సీనియర్ నాయకులు బీద గిరిధర్ మాట్లాడుతూ రెక్కలు ముక్కలు చేసుకుని రైతులు ఆరుగాలం పండించిన ధాన్యానికి సరైన ధర లేకపోవడంపై అన్నదాతలు తల్లడిల్లుతున్నారని ఆవేదన వ్యక్తపరిచారు. 17,18 తేదీల్లో కురిసిన అకాల వర్షంతో రైతులు తీవ్రంగా నష్టపోగా పండించిన ధాన్యాన్ని అమ్ముకోవాలంటే అనేక ఇక్కట్లు చెందుతున్నారని విచారం వ్యక్తపరిచారు. జరిగిన అన్యాయాన్ని చెప్పుకునేందుకు రైతులు వ్యవసాయ కార్యాలయానికి రాగా తాళాలు వేయడం సిగ్గుచేటన్నారు. అర్జీని తాళం వేసిన కార్యాలయం వద్ద ఉంచామన్నారు. స్పందన రోజైనా అధికారులు అందుబాటులో లేకపోవడం చాలా దారుణమన్నారు. ఎంఎస్‌పి ప్రకారం పండించిన ధాన్యాన్ని రూ.17వేలకు కొనాలని కాగా కావలి ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి జెసితో విచ్చేసి వెళ్లడం తప్ప నష్టపోయిన రైతుల కోసం కనీసం అధికారులతో రివ్యూ మీటింగ్ ఏమన్నా పెట్టారా అంటూ ప్రశ్నించారు. రైతులకు అన్యాయం జరుగుతూ ఉంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు అరగల రమణయ్య, రామిశెట్టి కృష్ణచైతన్య, విడవలూరు దశరథ రామిరెడ్డి, షేక్ నజీర్ బాషా తదితరులున్నారు.

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండలంలో రెండు రోజుల క్రితం కురిసిన అకాల వర్షానికి దెబ్బతిన్న వరి పంటను సోమవారం ఆత్మకూరు సహాయ వ్యవసాయ సంచాలకులు వి దేవసేనమ్మ, ఎఎస్‌పేట వ్యవసాయ అధికారిణి టి రజినీ పరిశీలించారు. పంట దెబ్బతిన్న రైతులు తమ సాగు భూమి వివరాలు ఆధార్ బ్యాంక్ ఖాతా నెంబరు వివరాలు గ్రామ వ్యవసాయ సహాయకులకు అందజేయాలని తెలిపారు. మండలంలో దెబ్బతిన్న వరి పత్తి తదితర పంటల వివరాలను నమోదు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఇఒ చిరంజీవి, విహెచ్‌ఎజె సంధ్యారాణి, రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : వర్షాలకు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని బిజెపి నాయకులు పసుపులేటి సుధాకర్ పేర్కొన్నారు. మండలంలోని జువ్వలదిన్నె పంచాయతీ వడ్డీ పాలెం, సిద్దన్నపాలెం పంచాయతీ, వెంకటేశ్వర పాలెం గ్రామంలో పర్యటించి గ్రామాల్లో అకాల వర్షాలకు దెబ్బతిన్న వరి నారుమళ్లను పరిశీలించి రైతులతో మాట్లాడారు. నాయకులు పసుపులేటి వెంకటేశ్వర్లు, తదితరులున్నారు.

ఖైదీలు మానసిక ఆరోగ్యం కలిగుండాలి

ప్రజాశక్తి-కావలి : ఖైదీలు మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకొని నేర ప్రవృత్తికి దూరంగా జీవించాలని మానసిక వైద్య నిపుణులు డాక్టర్ టి.రమ్య పేర్కొన్నారు. పట్టణంలోని సబ్ జైల్ ఆవరణలో మానసిక ఆరోగ్యంపై సోమవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. జిల్లా సబ్ జైల్ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఖైదీలు పరివర్తన చెంది, కుటుంబ వ్యవస్థను, అభివృద్ధి చేసుకొని జీవించాలన్నారు. ఊపిరితిత్తుల వ్యాధి నిపుణులు నక్కా రేవంత్, కావలి న్యాయస్థానాల స్వచ్ఛ భారత్ కమిటీ సభ్యులు ముడిగండ్ల.మాలకొండ రెడ్డి, నెల్లూరు సబ్ జైల్ అధికారి రవికుమార్, కావలి సబ్ జైల్ సూపరిటెండెంట్ చిన్ని, వెంకటసుబ్బయ్య, పాల్గొని ఖైదీలు ఆరోగ్యంగా, నేరాలకు దూరంగా, సమాజంలో గౌరవంగా జీవించాలని కోరారు.

'ఠాగూర్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : ఎఎస్‌పేటలోని ఠాగూర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లాస్థాయిలో జరిగిన ప్రతిభా పాటవపోటీలలో ప్రతిభ కనబరిచారు. జిల్లాస్థాయిలో జరిగిన స్టోరీ టెల్లింగ్‌లో ఠాగూర్ పాఠశాలకు చెందిన మోహన్ నరేంద్ర (9వ తరగతి) చెందిన విద్యార్థి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే తమ పాఠశాల నుండి జిల్లా స్థాయిలో జరిగిన డ్రాయింగ్ పోటీలలో లక్ష్మీశరణ్య ఎస్.సంజీవని విద్యార్థినులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు జిల్లా స్థాయిలో స్టోరీ టెల్లింగ్‌లో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్న మోహన్ నరేంద్రను పాఠశాల కరస్పాండెంట్ సిహెచ్ వెంకటరమణారెడ్డి, ప్రధానోపాధ్యాయులు కే.దొరస్వామిరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

స్వచ్ఛత అవార్డులకు దరఖాస్తులు

ప్రజాశక్తి-అల్లూరు : ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత అవార్డులు ఇచ్చేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సోమవారం నగర పంచాయతీ కమిషనర్ ఫణికుమార్ తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని పారిశుధ్యం, ఘన వ్యర్థాలలో ప్రతిభ చూపిన మహిళలను గుర్తిస్తున్నామన్నారు. 22వ తేదీ లోపు నగర పంచాయతీ పరిధిలోని అన్ని సచివాలయాలో దరఖాస్తులు తీసుకుంటున్నట్లు వివరించారు. మరుగుదొడ్ల నిర్వహణ, మంచినీటి శుద్ధి, తడి-పొడి చెత్త నుండి సంపద తయారీకి కృషి చేస్తున్న మహిళలకు అవార్డులకు అర్హులని తెలియబరిచారు.

మహారాజశ్రీ కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

E.P.No.120/2015
O.S.No. 447/2014

అమిశగడ్డ చంద్రశేఖర రావు (Died) మరియు వగైరాలు - డి.హెచ్.ఆర్స్.

Vs

కుర్రా జనార్ధన మరియు వగైరాలు - జె.డి.ఆర్స్.

వేలం ప్రకటన

పై నెంబరు E.P.లో ఈ క్రింది షెడ్యూలు దాఖలా తాలూకా జె.డి.ఆర్స్. స్థిరాస్తిని శ్రీ కోర్టువారు **తే10-04-2023 దిన ఉదయం గం॥ 10-30 నిమిషముల** నుంచి బహిరంగ వేలం జరుపుదురు. కావున ఆసక్తిగలవారు పై తేదీన శ్రీ కోర్టువారి ఎదుట హాజరై క్రింది షెడ్యూల్ ఆస్తిని వేలంలో పాట పాడుకోవచ్చునని ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూల్

ప్రస్తుతం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, పాత ప్రకాశం జిల్లా, కందుకూరు సబ్ రిజిస్ట్రేషన్, కందుకూరు మండలం, శ్రీరంగరాజపురం @ గోపాలపురం గ్రామం మరియు గ్రామ పంచాయితీ యిలాకాలోని స్థలం మరియు ఆర్.సి.సి. బిల్డింగ్ అసెస్‌మెంటు నెంబరు 82కు **హద్దులు: తూర్పు:** మంతు సుబ్బమ్మ, W/o వెంకటరెడ్డి స్థలం, **దక్షిణం:** బజారు, **పడమర:** కాకుమాని సుబ్బమ్మ, W/o సుబ్బారెడ్డి స్థలం, **ఉత్తరం:** దేవిరెడ్డి మాలకొండారెడ్డి S/o కోటిరెడ్డి భూమి, పై నాలుగు హద్దులలోని య.393. 3/4 చదరపు గజాల స్థలంలోని 63 చదరపు గజాల ఆర్.సి.సి. బిల్డింగ్, స్లాబ్ ఏరియా గల ఇల్లు స్థలము మరియు రాకపోకల హక్కులతో సహా.

డి.హెచ్.ఆర్. విలువ:- 1,00,000/-
అమీనా విలువ :- 2,50,000/-
మార్కెట్టు విలువ :- 6,83,910/-
వేలం తేది : 10-04-2023.

శ్రీ పెన్నా కృష్ణయ్య
శ్రీ నాదెళ్ళ యల్లమందరావు
డి.హెచ్.ఆర్.తరపు న్యాయవాదులు
కందుకూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

నోటీస్ అండర్ ఆర్డర్ 21 రూల్ 64, 66 సి.పి.సి మహారాజశ్రీ కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

E.P.No. 1/2019
O.S.No. 191 / 2017

మన్నం వెంకయ్య - డిక్రీహోల్డరు / వాది

Vs

రావి బృంద గోపీక్రిష్ణ - జడ్జిమెంట్ డెబ్టార్/ప్రతివాది

To,
రావిబృంద గోపీక్రిష్ణ, S/o **అచ్చయ్య నాయుడు,** వ్యాపారం, కోటారెడ్డి నగర్, కందుకూరు పట్టణం మరియు మండలం, పాత ప్రకాశం జిల్లా, ప్రస్తుతం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

పై నెంబరు అమలు దరఖాస్తులోని డిక్రీ హోల్డరు / వాది మీకు చెందియున్న ఇ.పి. షెడ్యూలు దాఖలా ఆస్థిని వేలం జరిపించి తనకు మీ నుండి రావలసిన ఇ.పి. బాకీని వసూలు చేయించమని పై కోర్టు వారిని కోరి యుండగా సదరు ఇ.పి. షెడ్యూలు ఆస్తిని వేలం జరుపుట లో మీకు గల ఆక్షేపణలు నిమిత్తం ఎన్నిసార్లు నోటీసులు పంపించినను మీకు జారీ కానందున మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసులు పంపించమని ఉత్తర్వులు జారీ చేసియున్నారు. కావున తేది: 31-3-2023 ఉదయం 10.30 నిమిషములకు పై కోర్టు వారి ఎదుట మీరు హాజరు పడి మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల పై వ్యాజ్యము మీ పరోక్షమున తీర్మానించదరని ఇందు మూలంగా తెలియజేయడమైనది.

పై కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
ఇట్లు
షేక్.మస్తాన్ వలి, బి.ఎ., ఎల్.ఎల్.బి.,
డిక్రీహోల్డరు / వాది తరపు న్యాయవాది
కందుకూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

కావలి సీనియర్ సివిల్ జడ్జివారికోర్టులో..

I.A.No.68/2022
O.S.No.7/2022

Between:
గుమ్మడి సురేంద్ర -పిటిషనర్/వాది

Vs

శ్రీరాజు ఆదిశేషారెడ్డి, వగైరాలు -రెస్పాండెంట్లు/ ప్రతివాదులు

To,
R1) **శ్రీరాజు ఆదిశేషారెడ్డి,** S/o **కొండారెడ్డి,** సిద్ధవరపు వెంకటేసుపాలెం గ్రామం, బోగోలు మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా. అనువారికి..

యీనెంబర్న పిటిషనర్ / వాదిమీపై తాత్కాలిక ఇంజెక్షన్ కోరి, పిటిషన్ దాఖలు చేసియున్నందున మీకు నోటీసు నిమిత్తం వాయిదా **తే11-04-2023ది** కి వుండివున్నది. కనుక ఆరోజున **ఉదయము గం.10.30 ని॥లకు** పైకోర్టువారి ఎదుట హాజరై, మీకుగల ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియెడల మీపరోక్షమందు యక్స్‌పార్టీగా తీర్మానించబడునని యిందు వల్ల తెలియజేయడమైనది.

వాయిదా తే.11-04-2023ది B/O

ఇట్లు
చెనికల రమేష్, M.A., B.L.,
పిటిషనర్ తరుపు న్యాయవాది
కావలి.

కావలి సీనియర్ సివిల్ జడ్జివారికోర్టులో..

OS.No.7/2022

Between:
గుమ్మడి సురేంద్ర, S/o **రామయ్య** - వాది

Vs

శ్రీరాజు ఆదిశేషారెడ్డి, వగైరాలు - ప్రతివాదులు

To,
D1) **శ్రీరాజు ఆదిశేషారెడ్డి,** S/o **కొండారెడ్డి,** సిద్ధవరపు వెంకటేసుపాలెం గ్రామం, బోగోలు మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా. అనువారికి..

యీనెంబర్న వాది మీపై దావా దాఖలు చేసికొనియున్నందున మీకు దావానోటీసు నిమిత్తం వాయిదా **తే11-04-2023ది** కి వుండివున్నది. కనుక ఆరోజున **ఉదయము గం.10.30.ని॥లకు** పైకోర్టువారి ఎదుట హాజరై, మీకుగల ఆక్షేపణలు తెలుపుకో వలసినది. లేనియెడల మీపరోక్షమందు యక్స్‌పార్టీగా తీర్మానించబడును యిందు వల్ల తెలియజేయడమైనది.

వాయిదా తే.11-04-2023ది B/O

ఇట్లు
చెనికల రమేష్, M.A., B.L.,
పిటిషనర్ తరుపు న్యాయవాది
కావలి.

టెండరు ప్రకటన
గ్రామ పంచాయతి కార్యాలయం - నల్లగొండ్ల

ROC No: 01 / 2023 **తేది: 20-03-2023**

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వింజమూరు మండలం నల్లగొండ్ల గ్రామ పంచాయతి నందు కాంట్రాక్టు పద్ధతిపై మంచినీటి నిర్వహణకు పోస్టు-1 ఒక సం॥ కాల పరిమితి అనగా **తేది: 01-04-2023 నుండి 31-03-2024 వరకు** నిర్వహించుటకు **తేది: 27-03-2023 న ఉదయం : 11:00 గం॥ల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు** గ్రామ పంచాయతి కార్యాలయం నందు టెండర్లు నిర్వహించబడును. ఆసక్తి కలవారు **రూ.1000/-** ధరావత్తు రుసుము చెల్లించి టెండర్లు దాఖలు పరచవచ్చును. మిగిలిన వివరములకు ఈ క్రింది వారిని సంప్రదించవలెను.

షేక్.సుల్తాన్ షరీఫ్ బాషా, పంచాయతి కార్యదర్శి
నల్లగొండ్ల గ్రామ పంచాయతి, వింజమూరు మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

టెండరు ప్రకటన
గ్రామ పంచాయతి కార్యాలయం - గుండెమడకల

ROC No: 01 / 2023 **తేది: 20-03-2023**

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వింజమూరు మండలం గుండెమడకల గ్రామ పంచాయతి నందు కాంట్రాక్టు పద్ధతిపై PWS స్కీమ్ ఆపరేటర్ కమ్ వాచ్‌మెన్ పోస్టు-1, గ్రామ పంచాయతి కార్యాలయ పారిశుధ్య నిర్వహణ (స్వీపరు) కు పోస్టు-1, ఒక సం॥ కాల పరిమితి అనగా **తేది: 01-04-2023 నుండి 31-03-2024** వరకు నిర్వహించుటకు **తేది: 27-03-2023 న ఉదయం : 11:00 గం॥ల** నుండి **మధ్యాహ్నం 2:00 గంటల** వరకు గ్రామ పంచాయతి కార్యాలయం నందు టెండర్లు నిర్వహించబడును. ఆసక్తి కలవారు **రూ.1000/-** ధరావత్తు రుసుము చెల్లించి టెండర్లు దాఖలు పరచవచ్చును. మిగిలిన వివరములకు ఈ క్రింది వారిని సంప్రదించవలెను.

బి.సుగుణ, పంచాయతి కార్యదర్శి
గుండెమడకల గ్రామ పంచాయితి, వింజమూరు మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

గ్రామ పంచాయతీ కార్యాలయం - కరేడు
ఉలవపాడు మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా

ఆర్.ఓ.సి.నెం.75/2022-23 **టెండరు ప్రకటన** **తేది: 17-03-2023**

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, ఉలవపాడు మండలం, కరేడు గ్రామ పంచాయతీ నందు ఒక సంవత్సర కాలమునకు అనగా తేది: 01-04-2023 నుండి 31-03-2024 వరకు ఈ దిగువ చూపిన షెడ్యూలు ప్రకారము సీలు వేసిన టెండర్లు తేది: 25-03-2023 మధ్యాహ్నం 2-00 గంటల వరకు మాత్రమే గ్రామ పంచాయతీ కార్యాలయములో పంచాయతీ కార్యదర్శి గారిచేగాని, లేక వారి అనుమతి పొందిన వారిచేగాని అనుమతించబడును. అదే రోజు మధ్యాహ్నం 3-00 గంటలకు హాజరైన టెండరు దారుల సమక్షములో టెండర్లు తెరవబడును. టెండరులో పాల్గొను వారు నిర్ణయించబడిన దరావత్తు చెల్లించి, రసీదు పొంది టెండరు షెడ్యూలుకు జతపరచవలెను. ధరావత్తు చెల్లించని మరియు సకాలములో రాని టెండర్లు స్వీకరించబడవు. మిగిలిన వివరములు కార్యాలయము పని చేయు వేళల యందు తెలుసుకొనవచ్చును.

వ.నెం.	పని వివరాలు	సంఖ్య	ధరావత్తు
1	కాంట్రాక్టు పద్ధతిపై స్వీపర్లుగా పనిచేయుటకు	15 మంది ఒక్కొక్కరికి	రూ. 100
2	కాంట్రాక్టు పద్ధతిపై శానిటరీ మేస్త్రీగా పనిచేయుటకు	1	రూ. 100
3	కాంట్రాక్టు పద్ధతిపై ఎలక్ట్రీషియన్‌గా పనిచేయుటకు	2	రూ. 100
4	కాంట్రాక్టు పద్ధతిపై P.W.S స్కీము టర్న్ కాక్‌గా పనిచేయుటకు	5	రూ. 100
5	కాంట్రాక్టు పద్ధతిపై చెత్త తోలుటకు కాంట్రాక్టరు డ్రైవర్‌గా పనిచేయుటకు	1	రూ. 100

నిబంధనలు :- 1. పై తెలిపిన పనులు చేయుటకు అనుభవము ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. 2. గ్రామ పంచాయతీ నిధుల సౌలభ్యమును బట్టి మాత్రమే బిల్లులు చేయబడును. 3. పని సంతృప్తికరముగా లేనియెడల సదరు కాంట్రాక్టును రద్దు చేయు అధికారం గ్రామ పంచాయతీకి కలదు. 4. కాంట్రాక్టు ఒక సం॥ కాలము మాత్రము. 5. కాంట్రాక్టర్లను గ్రామ పంచాయతీ సిబ్బందిగా పరిగణించబడరు. 6.టెండరు దారునకి, చెల్లింపులు చెక్కు ద్వారానే జరుపబడతాయి. 7. ట్రాక్టర్ డ్రైవర్ కొరకు వేయు టెండరు దారునకు డ్రైవింగ్ లైసెన్స్ మరియు ఇతర ప్రభుత్వ అనుమతులు కలిగి ఉండవలెను. 8. టెండరు ఆమోదించుట లేదా తిరస్కరించే అధికారం గ్రామపంచాయతీకి కలదు.

సం/- **కె.యస్.చక్రవర్తి, పంచాయతీ కార్యదర్శి,**
కరేడు గ్రామ పంచాయతీ, ఉలవపాడు మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.